పాతబస్తీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత


అజంపురాలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి మాధవీలత, లింగాల హరిగౌడ్

చాదర్‌ఘాట్: పాతబస్తీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని హైదరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. శుక్రవారం మలక్‌పేట నియోజకవర్గం అజంపురా డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి పాదయాత్ర ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కరపత్రాలు పంచుతూ బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ, పాతబస్తీ సమగ్రాభివృద్ధి కోరుకుంటున్న హైదరాబాద్‌వాసులు ఈసారి ఎన్నికల్లో తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ


మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ కమ్ సేల్) స్థానికుల ఆదరణను విశేషంగా చూరగొంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి నిరంతరం కృషి

నామినేషన్ వేసిన స్వతంత్ర ఎంపీ అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్


నామినేషన్ వేసేందుకు వెళ్తున్న వైష్ణవీ ప్రసాద్‌కు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

నాగోలు: అన్ని వర్గాల ప్రజలకు మరింత సేవ చేసేందుకు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) తెలిపారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు కొత్తపేటలో మారుతినగర్‌లోని భాగ్యనగర్ బ్రాహ్మణ సమాజ భవనం నుంచి ర్యాలీగా బయలుదేరి మోహన్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట, న్యూనాగోలు, సమతాపురి కాలనీ నుంచి ర్యాలీగా వెళ్లి మల్కాజిగిరి రిటర్నింగ్ కేంద్రంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల మనిషిగా, ప్రజల మధ్యలో ఉండి ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేయడానికి ముందుకు వస్తున్నానని తెలిపారు. పేద ప్రజలకు మేలు చేసే లక్ష్యంతో మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి మీ అందరి మద్దతుతో ఎంపీ పదవికి పోటీ చేస్తున్నానని తెలిపారు. తనను ఎంపీ గెలిపిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని తెలిపారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ నగరంలోని పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు, ఇతర కాలనీ వాసులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు దద్దు సుబ్రహ్మణ్యం, జంటనగరాల బ్రాహ్మణ సంఘాల సమాఖ్య పూర్వ అధ్యక్షుడు వారణాసి వంశీ, వక్కలంక శ్రీనివాస్ రావు, గొల్లపూడి రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కైలాస్, కర్ర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం


పార్కులో ప్రచారం చేస్తున్న మధుయాష్కీ గౌడ్, పట్నం మహేందర్ రెడ్డి

లింగోజిగూడ: సరూర్‌నగర్ చెరువు వద్ద ఉన్న ప్రియదర్శిని పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేసి అనంతరం వారితో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ, సరూర్‌నగర్ చెరువులో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పునరుద్ధరించి చెరువును శుద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు.మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి , నాయకులు ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, మల్లారపు షాలిని తదితరులు పాల్గొన్నారు.

మెట్రో విస్తరణతో మారనున్న ఎల్‌బీనగర్ ముఖచిత్రం

మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణ జరగనుండని, దీంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి ముఖచిత్రం మారనుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి హస్తినాపురంలోని జీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం డివిజన్ల కాలనీ సంక్షేమ సంఘాలు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసీ పరీవాహక శివారు ప్రాంతాల అభివృద్ధికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తోందని అన్నారు. సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజక వర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రత్యేక నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గజ్జి భాస్కర్ యాదవ్, ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, కార్పొరేటర్ సుజాతా నాయక్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, డివిజన్ల అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నరసింహాయాదవ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఉప్పరిగూడలో ఘనంగా మాతా జాగరణ్


పూజలు చేస్తున్న భక్తులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ శ్రీరామభక్త సమాజం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి రామాంజనేయ ఆలయంలో మాతా జాగరణ్ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగిన ఈ కార్యక్రమం దేవీనవరాత్రులను తలపించింది. అమ్మవారి నామస్మరణతో ఆ ప్రాంతం మొత్తం మార్మోగింది. భవసార్ క్షత్రియ సమాజ్ వారి భజన బృందం అమ్మవారి కథ, భక్తి పాటలతో భక్తులను పరవశింపజేసింది. కార్యక్రమంలో భవసార్ క్షత్రియ సమాజ్ రాష్ట్ర నాయకులు ఉమేశ్‌రావు జెత్నె, సభ్యులు కిషన్‌రావు గడాలే, బీజేపీ కార్పొరేటర్లు అరుణరెడ్డి, శంకర్‌యాదవ్ ఆలయ కమిటీ సభ్యులు నిరంజన్ యాదవ్, పెరిక శ్రీనివాస్, రామ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

వలసల జోరు..కారు బేజారు!

- నాయకులంతా హస్తం వైపే మొగ్గు
- కొద్దీ రోజులుగా ఊపందుకున్న వలసలు



ఎల్‌బీనగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్‌ఎస్‌లో పట్టున్న నాయకులందరూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీంతో కారు పార్టీ బేజారవుతోంది. రాజకీయ భవిష్యత్ కోసం నాయకులు కండువాలు మార్చడం నిత్యకృత్యంగా మారుతోంది. పైన మన ప్రభుత్వం లేదని తెలుసుకుని డివిజన్ స్థాయి నాయకులు, మాజీ కార్పొరేటర్లు కాలనీలో కాస్త పట్టున్న నాయకులు పార్టీ, నామిటేడ్ పదవుల భరోసాతో పార్టీ మారుతున్నట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మూడు నెలల క్రితం వరకు నిండుకుండలా ఉన్న బీఆర్‌ఎస్ నుంచి అధిక సంఖ్యలో పట్టున్న నాయకులు ఇతర పార్టీల్లోకి మారడంతో ఆ పార్టీ క్రమంగా బలహీనపడుతోంది. ఈ చేరికలు ఏ మేరకు పార్లమెంటు ఎన్నికల్లో ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గంలో రెండుసార్లు బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్న, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన సామ రమణారెడ్డితోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కర్మన్‌ఘాట్ ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, మాజీ చైర్మన్ ఈశ్వరమ్మయాదవ్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. అంతేకాకుండా టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు, పలువురు డివిజన్ స్థాయి నాయకులు ప్రతి రోజూ పార్టీలో చేరుతున్నారు.

మద్దతు కూడగడుతున్న కుటుంబ సభ్యులు..

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కుటుంబ సభ్యులు తమ పార్టీతో పాటు ప్రత్యర్థి పార్టీల ముఖ్యనేతల ఇళ్లకు వెళ్లి మద్దతు తెలపాలని కోరుతున్నారు. ఇక పార్టీలో చేరేందుకు ఇబ్బందులు ఉంటే ప్రచారంలో పాల్గొనకుండా అంతర్గతంగా మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా ఆమె భర్త మహేందర్‌రెడ్డి తనకు ఉన్న సంబంధాలతో అనేక మంది బీఆర్‌ఎస్ నాయకులతో ప్రతి రోజూ సంప్రదింపులు జరిపి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. కుమారుడు సైతం నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీలోకి యువతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆయన భార్య జమునాదేవి కూడా ఆత్మీయ సమావేశాలు నిర్వహించి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగికి లక్ష్మారెడ్డి కూడా స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి పర్యటించి ఓట్లను రాబట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

చేరికలపై దృష్టి..

ప్రధానంగా మూడు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇతర పార్టీల వారిని ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో డివిజన్ల వారీగా బలాబలాలను అంచనా వేసుకుంటూ క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కేంద్రీకరించారు. ఇప్పటికే కాంగ్రెస్‌లో బీఆర్‌కు చెందిన ముఖ్యనేతలు పార్టీలో చేరారు. ఇక మిగిలిన నాయకులపై ఆపార్టీ దృష్టి సారించింది. బీజేపీ కూడా డివిజన్ల వారీగా పట్టున్న నాయకులను చేర్చుకొనేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైన ఈసారి గతంలో మాదిరిగానే ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ దిశగా అడుగులు వేసేందుకు ఆపార్టీ నాయకులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఇక బీజేపీ కూడా తమకున్న కార్పొరేటర్ల ద్వారా ఓట్లను రాబట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని..

బాలాజీనగర్ వాసుల ఆందోళన



సైదాబాద్: రహదారి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నాడని బాలాజీనగర్ కాలనీవాసులు ఆరోపించారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీలో కొత్త రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ పది రోజుల క్రితం పాతరోడ్డును తవ్వించాడు. కాలనీవాసులకు, అసోసియేషన్ సభ్యులకు చెప్పకుండా జేసీబీతో పలు ఇళ్ల ముందు ఉన్న ర్యాంపులను తొలగించారు. అయితే కొందరు ప్రముఖుల ఆదేశాలతో కక్షపూరితంగా కొన్ని ఇళ్ల ముందు ర్యాంపులను మాత్రమే తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నిస్తే కాంట్రాక్టర్ తమను దుర్భాషలాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో రహదారి పనులు సక్రమంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి కాలనీవాసులు, మహిళలు.. తవ్విన రహదారిపైనే బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు తెలియజేశామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నరేందర్ యాదవ్, చిన్నా యాదవ్, దిలీప్, ప్రతాప్, బాబూలాల్, శేఖర్‌రెడ్డి, సుందర్‌రావ్ ఉన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 22, క్యారెట్ 33. దొండ 28, ఆలు 33, ఉల్లి 19, గోకర 28, దోస 15, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 55. శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ సీజ్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీ ఫేజ్-1 పక్క కాలనీలో గత ఐదేళ్లుగా అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను సరూర్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ప్రతి రోజూ బోరు నుంచి వేలాది లీటర్ల నీటిని తోడి అక్రమంగా విక్రయిస్తున్నారని, దీంతో కాలనీలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని కాలనీవాసులు, శ్రీరమణకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలాజీరావు కాంబ్లే , ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ సరూర్‌నగర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాదగిరికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం సందర్శించి సీజ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణమూర్తి, మోహన్‌నాయక్, రాజశేఖర్, గాలయ్య, ఆంజనేయులు, గౌతం, వివేక్, ప్రవీన్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

గోపీసింగ్ కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే



హస్తినాపురం: డివిజన్ పరిధిలోని ఇంద్రసేనా రెడ్డినగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోపీసింగ్ నాయక్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలిసి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మృతుడు గోపీసింగ్ నాయక్ నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంసభ్యులను ఓదార్చారు. డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, రమావత్ సత్యంచారి పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ మార్కెట్‌లో చలివేంద్రాల ఏర్పాటు

మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్

చాదర్‌ఘాట్: ఎండల తీవ్రత దృష్ట్యా మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ, మార్కెట్ ప్రాంగణంలో నాలుగు కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మార్కెట్‌లో మిర్చి సీజన్, ఎండలు ఎక్కువగా ఉండటం వలన అధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ చలివేంద్రాలను హమాలీలు, చాట్ కార్మికులు వినియోగించుకోవాలని కోరారు. ప్రతీ చలివేంద్రం వద్ద ఒక సెక్యూరిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వ్యాపారులతో మాట్లాడి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు లోడింగ్, అన్‌లోడింగ్ నిలిపివేసి వేడిమి తాపానికి ఉపశమనం కలిగేటట్లు చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన తులసి శ్రీనివాస్


రోహిత్ చౌదరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న తులసి శ్రీనివాస్

చైతన్యపురి: అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యదర్శి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తులసి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పేదల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి సాధ్యం అవుతుందనే నమ్మకంతో పార్టీలో చేరానని తులసి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ధర్మకర్త ఆనంద్‌గౌడ్, వైశ్య సంఘం అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిక


కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న సుర్వీ రాజుగౌడ్

నాగోలు: తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి సుర్వీ రాజుగౌడ్ తన అనుచరులతో కలిసి శుక్రవారం బీజేపీలో చేశారు. పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నాడు. ఈ సందర్భంగా సుర్వీ రాజుగౌడ్ మాట్లాడుతూ , తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాటాలు చేసిన తనకు బీఆర్‌ఎస్ పార్టీ తగిన గుర్తింపు ఇవ్వలేదని అన్నారు.

బైక్ చోరీలు చేస్తున్న పాతనేరస్తుడి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు (ఇన్‌సెట్‌లో నిందితుడు)

చైతన్యపురి: బైక్ దొంతనాలకు పాల్పడుతున్న పాతనేరస్తుడిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా జోగిపేటకు చెందిన బుద్దల శ్రీనివాస్ (45) బైక్ మెకానిక్. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీలో కొన్నాళ్లుగా నివసిస్తున్నాడు. శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు దొంగిలించిన బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న శ్రీనివాస్ కనిపించాడు. క్రైం పార్టీ సిబ్బంది అతడి అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాల విషయం బయటపడింది. సులువుగా డబ్బు సంపాదించేందుకు బైక్ చోరీలు చేస్తున్నానని, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు బైక్‌లు దొంగిలించానని ఒప్పుకున్నాడు. గతంలో సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ చోరీకి పాల్పడిన పాత నేరస్తుడని, అతడి వద్ద నుంచి రూ. 1.5 లక్షల విలువైన మూడు బైక్‌లు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఏరియా ఆసుపత్రిలో నీటి సౌకర్యం నిల్

రోగులు, సహాయకుల అవస్థలు


వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సాధారణ అవసరాలకు సరిపడా నీటి సౌకర్యం లేక రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో ఉన్న బోరు ఎండిపోయి సంవత్సరాలు గడుస్తున్నా జలమండలి నుంచి ఎలాంటి నల్లా కనెక్షన్ లేకపోవడంతో చాలా కాలంగా బయటినుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పిస్తున్నారు. రోజు 5 నుంచి 6 ట్యాంకర్ల నీటిని తెప్పిస్తున్నామని సిబ్బంది చెపుతున్నా ప్రజల తాకిడికి తగ్గట్లుగా నీరు సరిపోవడం లేదు. టాయిలెట్లలో నల్లాల నుంచి నీరు రాకపోవడంతో రోగులు, వారి సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆసుపత్రి ప్రాంగణంలో బోర్లు వేయించడం లేదా.. జలమండలి నుంచి నల్లా కనెక్షన్లు తీసుకోవడం లేదా.. ఆసుపత్రికి వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ ట్యాంకర్లతో నీటి తెప్పించడం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హస్తినాపురంలో అక్రమ కట్టడాల కూల్చివేత


హస్తినాపురం వై జంక్షన్‌లో అధికారులు కూల్చివేసిన షెడ్డు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డులోని వైజంక్షన్ దగ్గర అక్రమంగా నిర్మించిన షెడ్డును టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని ఇందిరమ్మ వీకర్ సెక్షన్ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను అధికారులు కూల్చివేశారు. టౌన్‌ప్లానింగ్ చైర్మన్ జ్ఞానేశ్వర్ కూల్చివేతలను దగ్గరుండి పర్యవేక్షించారు.

డబ్బులు ఇవ్వలేదనే...?

హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డులో ఎంతో మంది ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపార సముదాయాలు నిర్మాణాలు చేపట్టి వ్యాపారం నిర్వహిస్తున్నారని, వారు చైన్‌మెన్‌కు, టీపీఎస్‌కు డబ్బులు ఇవ్వడంతో వారి జోలికి అధికారులు వెళ్లలేదని, తాము డబ్బులు ఇవ్వకపోవడంతో తమ షెడ్డును కూలిచ్చేశారని బాధితులు ఆరోపించారు. జిల్లా పరిషత్ రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికారులకు డబ్బులు ఇచ్చి హోటళ్లు, చికెన్ షాపులు, వైన్‌షాపులు ఏర్పాటు చేశారని, టౌన్‌ప్లానింగ్ అధికారులు వారి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని, వాటిపక్కనే ఉన్న తమ షెడ్డును కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని బాధితుడు జితేందర్‌రెడ్డి ప్రశ్నించారు.